సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం। 13। జనవరి। 2023



12,00,000 గుడ్లు గుటుక్కు
జిల్లాలో కోడిగుడ్డు వినియోగం పెరిగింది. ఎగ్‌లో అధికంగా పోషకాలు ఉండడంతో ప్రజలు ఇష్టంగా తింటున్నారు. ఈక్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి పెరిగింది. -IIలో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,790
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,162
3 శాతం జీఎస్టీతో	రూ.5,317
సవర (8 గ్రా)	రూ.42,536

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.6 /20.4

గురువారం గాలిలో 58 శాతం తేమ ఉంది. శుక్రవారం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉండొచ్చని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎస్సైల బదిలీ
నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సీహెచ్ విజయారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమశిల ఎస్సై మాబుసుభానీని బాలాజీనగర్‌కు, అక్కడ పనిచేస్తున్న భోజ్యానాయక్‌ను సోమశిలకు, ఏఎస్‌పేట ఎస్సై సుభాన్‌ను జిల్లా వీఆర్‌కు, బాలాజీనగర్ ఎస్సై నరేష్‌ను ఏఎస్‌పేటకు, వీఆర్‌లో ఉన్న సుమన్‌ను బాలాజీనగర్‌కు బదిలీ చేశారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

సోమశిలలో 71.761 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం నాటికి 71.761 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 2,111 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

రవాణా శాఖ అధికారుల తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నెల్లూరు(టౌన్): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని డీటీసీ చందర్ గురువారం తెలిపారు. జాతీయ రహదారిపై వెంకటాచలం, కావలి టోల్‌గేట్లతోపాటు దుత్తలూరు ప్రాంతాల్లో మూడురోజుల నుంచి తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తించి 31 కేసులు నమోదు చేశారు. ట్రావెల్స్ యజమానుల నుంచి రూ.3 లక్షల జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో ఆర్టీఓలు మురళీమోహన్, సుధాకర్‌రెడ్డి, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, గోపీనాయక్, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా జరుగుతున్న రామాయపట్నం పోర్టు నిర్మాణం

సింహపురి.. పారిశ్రామిక ఝరి

- మూడేళ్లలో క్రిస్ సిటీ సిద్ధం
- వేగంగా రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు
- ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థల పరిశీలన
- మిథానీ, క్రిబ్‌కో పరిశ్రమల ఏర్పాటు వేగవంతం
- నూతన, అనుబంధ పరిశ్రమల ద్వారా భారీ పెట్టుబడులు
- పెద్దసంఖ్యలో ఉద్యోగాల కల్పన

ఏపీ నెట్‌వర్క్: ఎందరో నాయకులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, కళాకారుల జన్మస్థలమైన ఉమ్మడి నెల్లూరు జిల్లా.. భవిష్యత్‌లో పెద్ద పారిశ్రామిక నగరాల సరసన చేరేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. తద్వారా భారీగా పెట్టుబడులు రావడంతోపాటు స్థానికులకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై అత్యంత కీలకమైన ప్రాంతంలో ఉన్న జిల్లా గతంలోనే ఎన్నో పరిశ్రమలకు నిలయంగా ఉండేది. ఇప్పటికే అభివృద్ధి చెందిన నాయుడుపేట, గూడూరు, తడ తదితరాలతోపాటు రామాయపట్నం పోర్టు జిల్లాకు అందివచ్చిన అవకాశంగా నిలిచింది. ఈ ప్రాంతాన్ని పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా మార్చేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మరోవైపు ఇప్పటికే ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తాజాగా క్రిస్ సిటీకి గ్రీన్‌సిగ్నల్ రావడంతో మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తున్నారు.

రాబోయే మూడేళ్లలో..

చెన్నై – విశాఖ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. గూడూరు నియోజకవర్గంలోని కోట, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం ద్వారా వేలమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (నిక్డిక్), రాష్ట్ర పభుత్వ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ సంయుక్త భాగస్వామ్యంతో ఇక్కడ సకల సదుపాయాలు సమకూర్చి పరిశ్రమలకు కేటాయిస్తారు. రానున్న మూడేళ్లలో సరికొత్త పారిశ్రామిక నగరం క్రిస్ సిటీ అందుబాటులోకి రానుంది. అందులో రూ.37,500 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని అంచనా వేస్తున్నారు. టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఎంఎస్ఎంఈ రంగాల పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు. తొలివిడతలో ఇప్పటికే 2,500 ఎకరాలకు గానూ 2,091 ఎకరాల భూసేకరణ చేశారు. 36 నెలల కాలవ్యవధిలో మౌలిక వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ 50 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అందుకోసం 2022 మే 10వ తేదీన పర్యావరణ అనుమతులు లభించాయి. కండలేరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా అనుమతులు సైతం పూర్తయ్యాయి.

మూడేళ్లలో 13 భారీ పరిశ్రమలు
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు మరింతగా ప్రోత్సాహం అందించారు. పరిశ్రమల శాఖామంత్రిగా దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి చొరవతో గత మూడేళ్లలోనే 13 భారీ పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాయి. రూ.1,806.72 కోట్లతో ఏర్పాటైన వీటిలో సుమారు 1,780 మంది ఉపాధి పొందుతున్నారు. ఇంకా 2,568 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు రూ.1,785.54 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటై 18,031 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

చకచకా ఇండస్ట్రియల్ కారిడార్ పనులు
➡ కొడవలూరు మండలం బొడ్డువారిపాళెంలో నాల్కో–మిథానీ సంయుక్త సంస్థ ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగం లిమిటెడ్ ఆధ్వర్యంలో అల్యూమినియం పరిశ్రమ 110 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. అందుకు రూ.6 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. ఇప్పటికే భూ సేకరణకు అడ్డంకులు తొలగిపోయాయి. ఇది ఏర్పాటైతే 2 వేల మందికి ప్రత్యక్షంగా, మరో పదివేల మందికి పరోక్షంగా ఉపాధి ఉంటుంది.

➡ సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం క్రిబ్‌కో ఎరువుల కర్మాగారాన్ని 290 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. రూ.2 వేల కోట్లతో నెలకొల్పి రెండువేల మందికి ఉపాధి కల్పించనున్నారు.

శరవేగంగా రామాయపట్నం పోర్టు పనులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు ప్రస్తుతం జెట్‌స్పీడ్‌తో సాగుతున్నాయి. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రావూరు పంచాయతీ పరిధిలోని మొండివారిపాళెం, ఆవులవారిపాళెం, సాలిపేట పంచాయతీ పరిధిలోని కర్లపాళెం గ్రామాల పరిధిలో ఉన్న సముద్ర తీర ప్రాంతం వద్ద పోర్టు నిర్మాణానికి 850 ఎకరాల భూములను సేకరించి కేటాయించారు. రూ.3,736 కోట్ల ఖర్చుతో చేపట్టిన మొదటిదశలో నాలుగు బెర్తుల నిర్మిస్తారు. ప్రస్తుతం నార్త్, సౌత్ బ్రేక్‌వాటర్ ఫీడర్‌ల నిర్మాణ పనులతోపాటు, బెర్తు నిర్మాణ ప్రాంతంలో సముద్ర లోతును పెంచే డ్రెడ్జింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం నాలుగు బెర్తులు నిర్మించి 25 మిలియన్ టన్నుల కార్గో రవాణా చేయాలన్న లక్ష్యంతో మొదటిదశ పనులు చేపట్టారు. అనంతర క్రమంలో దీన్ని పది బెర్తులకు పెంచాలనే ప్రతిపాదన ఉంది. మొదటి దశ పనులు పూర్తయితే 3 నుంచి 4 వేలమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా పెద్దఎత్తున అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెట్టు వద్ద రైల్వేస్టేషన్ ఉండడంతోపాటు, చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి పోర్టు సమీపం నుంచే వెళ్తుంది. పోర్టుకు అనుబంధంగా తెట్టు వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రతిపాదించారు. దీనికి గానూ జాతీయ రహదారిపై ఉన్న తెట్టు జంక్షన్ నుంచి గుడ్లూరు వైపు వెళ్లే మార్గంలో తెట్టు–శాంతినగర్ మధ్యలో 2,024 ఎకరాల భూములను పరిశీలిస్తున్నారు. మరోవైపు గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాల పరిధిలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. దాదాపు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో సోలార్ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమను ఇక్కడ నెలకొల్పనున్నారు.

వైఎస్సార్ హయాంలోనే శ్రీకారం
ఆసియాలోని అతి పెద్దదైన కృష్ణపట్నం ఓడరేవును 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించారు. 14 బెర్తులతో ఏర్పాటైన ఈ పోర్టు 2014–15లోనే రూ.1,800 కోట్ల వార్షికాదాయం ఆర్జించింది. ఆ పోర్టుకు అనుబంధంగా ఏడు పామాయిల్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. బొగ్గు దిగుమతి అవకాశాలు మెరుగవడంతో ఏపీ జెన్‌కో పవర్ ప్లాంట్లను రెండు దశలుగా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సుమారు 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుకు అవకాశం రావటంతో తడ మండలం మాంబట్టు, ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల మధ్య శ్రీసిటీ, నాయుడుపేట వద్ద మేనకూరు సెజ్‌లను అప్పట్లోనే ఏర్పాటు చేశారు. శ్రీసిటీలో 300 పరిశ్రమలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం సుమారు లక్షమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో లక్షమందికి పైగా ఉపాధి పొందుతున్నారు. మాంబట్టు సెజ్‌లో 20 పరిశ్రమల వరకు ఏర్పాటు చేయగా పది వేల మంది ప్రత్యక్షంగా, మరో 15 వేల మంది పరోక్షంగా, మేనకూరు సెజ్‌లో 29 పరిశ్రమలు ఏర్పాటుకాగా దాదాపు 15 వేల మంది ప్రత్యక్షంగా, 10 వేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

జిల్లాలో అపార అవకాశాలు
జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అపార అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎందరో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. గత మూడేళ్లలోనే మెగా, భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి కల్పించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మిథానీ, క్రిబ్‌కో వంటి భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. పోర్టుల పరిధిలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పిస్తున్నాం.

– జి.ప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం, నెల్లూరు

క్లుప్తంగా

నెల్లూరులో కరోనా కేసులు

నెల్లూరు(అర్బన్): ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి వచ్చిన వారిలో ముగ్గురు వ్యక్తులకు గత పదిరోజుల్లో ఒమిక్రాన్ కరోనా సోకినట్లు తెలిసింది. వీరంతా పూర్తిగా కోలుకున్నట్లు చెబుతున్నారు. కాగా ఇది ప్రమాదకరమైన ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ బీఎఫ్-7 కాదా అని తేలలేదు. బాధితులు పాజిటివ్ వచ్చిన విషయాన్ని వైద్యశాఖ దృష్టికి తీసుకెళ్లి ఉంటే వారు నమూనాలు సేకరించి జీనోమ్ సీక్వెన్సీకి పంపేవారు. అక్కడ ఏ రకం సబ్ వేరియంటో తేల్చేవారు. దీనిపై డీఎంహెచ్‌ఓ పెంచలయ్య గురువారం మాట్లాడుతూ కరోనా వచ్చినట్లు తమ దృష్టికి ఎవరూ తీసుకురాలేదన్నారు. ప్రజలు మాస్క్‌లు ధరించి భౌతిక దూరం పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

లింగసముద్రం : ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని పెంట్రాల నుంచి మొగిలిచర్ల వెళ్లే రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు.. వలేటివారిపాలెం గ్రామానికి చెందిన జయంపు చిన్నా (36) కుటుంబసభ్యులతో మండలంలోని మొగిలిచర్లలో మినుము పొలాలకు కాపలాగా ఉంటున్నాడు. వలేటివారిపాలెం మండలంలోని అంకభూపాలపురంలో బంధువుల కర్మ కాండలకు వెళ్లి వస్తుండగా పెంట్రాల నుంచి మొగిలిచర్ల వెళ్లే రోడ్డులో పాలకేంద్రం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్నా తారురోడ్డుపై పడడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సాయంతో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురువారం పేర్కొన్నారు.

గేదెను ఢీకొని..

మర్రిపాడు : మండలంలోని పొంగూరు-కేతిగుంట మార్గమధ్యలో బుధవారం రాత్రి ఓ గేదెను బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మోదేపల్లి చౌదరి (37) అనే వ్యక్తి మర్రిపాడులో హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. హోటల్ మూసిన తర్వాత అత్తారింటికి వెళ్లేందుకు బైక్‌పై కేతిగుంట గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో గేదెను ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆత్మకూరుకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అయితే గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు మర్రిపాడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	123
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	240
లేయర్ చికెన్ :	153

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.15
సన్నవి : రూ.9
పండ్లు : రూ.3



12,00,000 గుడ్లు గుటుక్కు



- ఇదీ ఒక్కరోజుకు జిల్లాలో వినియోగం
- కోడిగుడ్డులో అధికంగా పోషకాలు
- ఇష్టంగా తింటున్న ప్రజలు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- నిలకడగా ఉండని ధరలు

కోడిగుడ్డు వినియోగం జిల్లాలో ఏడాదికేడాది పెరుగుతోంది. మాంసాహారులతో పాటు శాఖాహారులు కూడా గుడ్డును ఆహారంగా తీసుకుంటున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం గుడ్డు వినియోగం దాదాపు 3.5 లక్షలుంటే నేడు రోజుకు 12 లక్షల గుడ్లకు చేరింది. అంటే వాటి వినియోగం దాదాపు మూడురెట్లు పెరిగింది.

–సాక్షి, నెల్లూరు డెస్క్:

నేడు మార్కెట్‌లో వినియోగదారులు ఏది కొనాలన్నా కల్తీల బెడద ఎక్కువగా ఉంది. పాలు, కారం, పప్పులు, నూనెలు ఇలా దేనినీ వదలకుండా కొందరు వ్యాపారులు కల్తీమయం చేశారు. కూరగాయలు కొందామంటే వాటిలోనూ విషపూరిత రసాయన అవశేషాలు ఉంటున్నాయి. కల్తీ చేయలేని కొన్నింటిలో కోడిగుడ్డు ఉండటం విశేషమే. కాబట్టే డాక్టర్లు కూడా రోజుకు ఒక గుడ్డును ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెబుతుంటారు.

అందుబాటు ధరలో..

నేడు ఏ హోటల్‌కో.. టీ స్టాల్‌లో వెళ్లి ఓ కప్పు టీ తాగితే కనీసం రూ.10 చెల్లించాలి. అదే రిటైల్‌గా ఒక కోడిగుడ్డు ధర రూ.6 నుంచి రూ.7కు అందుబాటులో ఉంటుంది. టీలో కంటే గుడ్డులోనే పోషకాలు ఎక్కువని ఎగ్ ప్రేమికులు చెబుతుంటారు. ఎగ్ మాంసాహారమా కాదా అనే విషయమై భిన్న వాదాలున్నా ఎక్కువమంది తీసుకుంటున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.

తక్కువ సంఖ్యలో ఫారాలు

జిల్లాలో పౌల్ట్రీ ఫారాలు రెండు దశాబ్దాల క్రితం వరకు పెద్ద సంఖ్యలో ఉండేవి. అయితే కాలక్రమంలో వాటిలో పెట్టుబడికి తగిన విధంగా లాభాలు లేకపోవడంతో చాలామంది తీసివేశారు. ప్రస్తుతం ఆరు నుంచి పది వరకు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఫారంలో కెపాసిటీని బట్టి కోళ్ల సంఖ్య వేల నుంచి లక్షల్లో ఉంటుంది. జిల్లాలో దాదాపు 4 లక్షల వరకు లేయర్ కోళ్లను రైతులు పెంచుతున్నారు. వాటి పెంపకం కూడా చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కోళ్లకు ఆహారంగా మొక్కజొన్న, సోయాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. సోయా రేటు కిలో రూ.50కు, మొక్కజొన్న కిలో రూ.24కు చేరింది. దాణా రేట్లు పెరిగిన మేరకు కోడిగుడ్డు రేటు పెరగకపోవడంతో పౌల్ట్రీ రైతులు నష్టాలకు గురవుతున్నారు. వీటితోపాటు కోళ్లకు వ్యాధులు సోకకుండా మందుల వినియోగం, పనివాళ్ల జీతాలు, కరెంట్ వినియోగం తదితరాల ఖర్చులు పెరిగిపోయాయని, దీంతో లేయర్ కోళ్ల పెంపకం కష్టంగా మారిందని వాపోతున్నారు.

రోజుకు 3.5 లక్షల గుడ్ల ఉత్పత్తి

జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి తక్కువగా ఉండగా వినియోగం మాత్రం రోజుకు 12 లక్షల వరకు ఉంటోంది. దీంతో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి కోడిగుడ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో రైతుకు హోల్‌సేల్‌గా ఒక్కో గుడ్డుకు రూ.5 వరకు అందుతోంది. అయితే ఈ రేటు ఎక్కువ కాలం ఉండదని అంటున్నారు. ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున అక్కడ గుడ్డును ఎక్కువగా తీసుకుంటారు. దాంతో డిమాండ్ ఏర్పడి ముంబై, ఢిల్లీ, లక్నో, బెంగాల్ వ్యాపారులు గుడ్లను కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగానే రేటు పెరిగిందని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు.

పోషకాలు ఏమిటంటే..

100 గ్రాముల బాయిల్డ్ గుడ్డు తీసుకుంటే 155 కేలరీల శక్తి అందుతుంది. కొవ్వు 11 గ్రాములు, సోడియం 12.4, పొటాషియం 12.6, ప్రొటీన్లు 13 గ్రాములుంటాయి. ఇంకా ఐరన్, కాల్షియం, విటమిన్ డీ కూడా ఉంటాయి.

రకరకాలుగా..

కోడిగుడ్డును ప్రజలు పలు రకాలుగా వినియోగిస్తుంటారు. బాయిల్ చేసి షెల్ తీసేసి నేరుగా తీసుకోవచ్చు. బాయిల్ చేసిన గుడ్డును సాంబారులో లేదా పలావులో లేదా టామోటా రసంలో కలుపుకొని తీసుకోవచ్చు. మరికొందరు ఆమ్లేట్‌గా తీసుకుంటారు. అంతేకాకుండా సమోసాల తయారీలో, బజ్జీల తయారీలో కోడిగుడ్డును వినియోగిస్తారు. పచ్చిమిర్చి, ఉల్లిని చిన్నచిన్న ముక్కలుగా తరిగి వాటితో కోడిగుడ్డు కలిపి పెనంపై వేయించి పొరుటుగా చేసుకుని కూడా తీసుకుంటారు.

జిల్లాలో..

పెంచుతున్న కోళ్ల సంఖ్య :	4 లక్షలు
రోజుకు కోడిగుడ్ల దిగుబడి :	3.5 లక్షలు
ఇతర రాష్ట్రాల నుంచి గుడ్ల దిగుమతి :	8.5 లక్షలు
పౌల్ట్రీ రైతుకు దక్కుతున్న రేటు :	రూ.5
మార్కెట్‌లో రిటైల్‌గా గుడ్డు ధర:	రూ. 7 (సుమారుగా)

తక్కువ ఖర్చుతోనే పౌష్టికాహారం



గుడ్డు తినడంతో తక్కువ ఖర్చుతోనే పౌష్టికాహారం అందుతుంది. శరీరానికి అవసరమైన విటమిన్ డీతోపాటు కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్ లాంటి 13 రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు అధికంగా లభిస్తాయి. విటమిన్ ఈ, అమైనో ఆమ్లాలు శరీరానికి సరిపడిన మోతాదులో అందుతాయి. గుడ్డు ద్వారా హై క్వాలిటీ ప్రొటీన్స్ సమకూరుతాయి. రోజూ ఒక గుడ్డు వినియోగించేవారికి ఎముకల పటుత్వంతోపాటు గుండె, లివర్ పనితీరు బాగుంటుంది. తెల్లసొనలో అధికంగా ప్రొటీన్స్, పసుపు సొనలో విటమిన్స్ ఎక్కువగా ఉంటాయి. అందువల్ల గుడ్డు మొత్తాన్ని తినాలి.

– డాక్టర్ గంగాధర్, ఎండీ, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్యశాల

రూ.5కి తగ్గితే గిట్టుబాటు కాదు



కోడిగుడ్డు కల్తీలేని ఆహార పదార్థం. వినియోగం పెరుగుతున్నా పౌల్ట్రీ రైతులకు మాత్రం గిట్టుబాటు ధర రావడం లేదు. కోళ్లకు దాణాగా వాడే సోయా, మొక్కజొన్న రేట్లు పెరిగాయి. అదే దామాషాలో గుడ్డు రేటు పెరగడం లేదు. కొన్ని అన్‌సీజన్లలో గుడ్డు రేటు దారుణంగా పడిపోతోంది. ఖర్చులకు తగిన విధంగా డబ్బు రాకపోవడంతో చాలామంది రైతులు పెంపకాన్ని వదులుకున్నారు. గుడ్డు రేటు రూ.5కు తగ్గకుండా రైతుకు దక్కితేనే కోళ్ల పెంపకం నిలబడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పౌల్ట్రీ రైతులను ఆదుకునే చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– కర్నా రాఘవరావు, పౌల్ట్రీ రైతు, తలమంచి

యువతకు మార్గదర్శి వివేకానంద



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి

- ఘనంగా యువజనోత్సవం

నెల్లూరు(అర్బన్) : భారతదేశ కీర్తి ప్రతిష్టలను దశ, దిశలా చాటిన స్వామి వివేకానంద యువతకు మార్గదర్శి అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. యువజనుల శాఖ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు, యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ స్వామి వివేకానంద తన ప్రసంగంతో ఎలాంటి వారినైనా ఆకట్టుకునే వారన్నారు. జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ స్వామి వివేకానందకు జ్ఞాపకశక్తి, ఓర్పు, నేర్పు, యుక్తి ఉండన్నారు. యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన వారికి, రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు అవార్డులు అందచేశారు. ఖతక్ డ్యాన్స్‌లో త్రిపుర నిఖిత, కూడిపూడి నుంచి శరణ్యరెడ్డి ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. వీణ వాయిద్యంలో గిరిజ, ఫ్యాన్సీ వేషధారణలో మషీర తృతీయ స్థానాలు పొందడంతో వారిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి, సెట్నల్ సీఈఓ పుల్లయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, బీసీ సంక్షేమ శాఖాధికారి వెంకటయ్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ భవిత యువత చేతుల్లోనే..

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం : దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, దేశ సమైక్యతను కాపాడటంలో యువ భాగస్వాములు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాచలం మండలం సరస్వతీ నగర్‌లోని అక్షర విద్యాలయంలో స్వామి వివేకానంద విగ్రహానికి, సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ విగ్రహానికి గురువారం వెంకయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ స్వామి వివేకానంద జయంతిని భారత ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. జన్మభూమిని, తల్లిదండ్రులను, మాతృభాషను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అక్షర విద్యాలయ విద్యార్థుల నృత్య ప్రదర్శనను ఆయన తిలకరించారు. కార్యక్రమంలో వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, అక్షర విద్యాలయ అకడమిక్ డైరెక్టర్ కుముద, ప్రిన్సిపల్ ప్రియా జాకబ్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా, అనంతపురం, తూర్పుగోదావరి, వైఎస్సార్ జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలువగా పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, వైఎస్సార్ జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచినట్లు టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తిరుపతయ్య వివరించారు. విజేతలకు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జె.ప్రణీత్, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, వినియోగదారుల ఫోరం సభ్యుడు ఎస్.వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ ఎస్.వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున పాల్గొన్నారు.

గోవిందయ్య సేవలు చిరస్మరణీయం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



గోవిందయ్య చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి కాకాణి, గౌడ నేతలు

నెల్లూరు(వేదాయపాళెం) : జిల్లా గౌడ, కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ సేవాసమితి ట్రస్టు వ్యవస్థాపకుడు కోసూరు గోవిందయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న గోవిందయ్య నివాసంలో ఆయన ఉత్తరక్రియలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి కాకాణి హాజరై, గోవిందయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కాకాణి మాట్లాడారు. గౌడ విద్యార్థుల ఉన్నత చదువుకు గోవిందయ్య ఎంతో సాయం చేశారని, వారి సమస్యలపై పోరాటం చేసి, పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం నేత బీద రవిచంద్ర, రాష్ట్ర గౌడ సంఘ మాజీ అధ్యక్షుడు తాతాజి జయప్రకాష్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రాంప్రసాద్, నేతలు నారాయణ, రామగోపాల్, రావుల దశరథరామయ్య, జంపానీ రాఘవరావు, చిరంజీవి పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖపై సీఎం ప్రత్యేక దృష్టి

నెల్లూరు(సెంట్రల్) : 'సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రైతుల కోసం అనేక పథకాలను ప్రారంభించారు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం-2023 డైరీని గురువారం మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలో వ్యవసాయశాఖ పనితీరు గొప్పగా ఉందని బ్రిటీష్ హైకమిషన్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలభాస్కర్, సెక్రటరీ ప్రవీణ్, ట్రెజరర్ మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు కమలాకర్ శర్మ, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హరికరుణాకర్‌రెడ్డి, సెక్రటరీ నాగమోహన్, ట్రెజరర్ జహీర్ పాల్గొన్నారు.

ఆహార పరిశ్రమలకు సబ్సిడీ రుణాలు

నెల్లూరు(అర్బన్) : ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాన్ని ఉపయోగించుకుని ఆహార రంగంలోని పరిశ్రమలకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, నెల్లూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆహార పరిశ్రమలకు సంబంధించి గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. నగరంలోని అనేక మంది చిన్న ఆహార పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వీరి వ్యాపారాలు విస్తరించేందుకు ప్రభుత్వం సాయపడుతోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజు, లైవ్‌లీ హుడ్ డీపీఎం నాగేంద్ర, రిసోర్స్ పర్సన్ మధుసూదన్, ఏపీఎంఐపీ ఎంఐడీసీ నరేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 4కే రన్



వివేకానందుడి చిత్రపటానికి నివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 4కే రన్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద కార్యక్రమాన్ని ఆరెస్సెస్ నేత యుగంధర్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ప్రారంభించారు. మనోజ్, వాజిద్, మనోహర్ మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. బెస్ట్ ఉమెన్ రన్నర్‌గా వేదవర్షిణి, బెస్ట్ వెటరన్ రన్నర్‌గా రమణయ్య నిలిచారు. విజేతలకు బహుమతులను అందజేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, రాజేష్, విజయ్‌కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, సాయి, శివ, కార్తీక్, మణి, విజయ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మాగుంట లేఅవుట్లోని పార్కు వద్ద గల వివేకానందుడి విగ్రహానికి సామాజిక సమరసత వేదిక, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సత్యనారాయణ, మురళీధర్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, జయప్రకాష్, కేశవులు, దశయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాగుంట లేఅవుట్లో..

దళిత అధికారులపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(వేదాయపాళెం): దళిత అధికారులను టార్గెట్ చేసి దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేత రాజు దళిత ద్రోహి అని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య ఆరోపించారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ హయాంలో దళితులపై దాడులు జరిగినా, ఆయన ప్రస్తావించలేదని చెప్పారు. దళితులపై ప్రస్తుతం దాడులు పెరిగిపోతున్నాయంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. జిల్లాలో దళితులకు అండగా నిలుస్తున్న ఎస్పీ విజయారావు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించడం తగదన్నారు. దళిత అధికారులను లక్ష్యంగా చేసుకొని విమర్శిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నేతలు వెంకట్రావు, చిన్నయ్య, వెంకటరమణయ్య, రఘు, సాల్మన్, శ్రీనివాసులు, సుధాకర్, ప్రసాద్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్లకు సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గుంటూరులో ఇటీవల నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ మీట్‌లో పతకాలను సాధించిన అథ్లెట్లను గురువారం సత్కరించారు. శాంతినగర్‌లోని నిర్మల సౌధలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడారు. 37 స్వర్ణ, 24 రజత, 10 కాంస్య పతకాలను జిల్లా అథ్లెట్లు సాధించారని వివరించారు. మహిళా విభాగంలో 172 పాయింట్లను సాధించి ఉమెన్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారని పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, రత్నం, చంద్రమౌళిరెడ్డి, కార్యదర్శి కోటేశ్వరమ్మ, కోశాధికారి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ



వివేకానందుడి విగ్రహానికి నివాళులు

నెల్లూరు(టౌన్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్ నుంచి మాగుంట లేఅవుట్లోని అనిల్ గార్డెన్స్ వరకు ర్యాలీని ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం నిర్వహించారు. అక్కడి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మదర్‌థెరిసా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ నరేంద్రబాబు, అధికారులు నాగరాజు, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు



నెల్లూరు(వేదాయపాళెం): వీఆర్సీ సెంటర్‌లో లభించిన ముగ్గురు చిన్నారులను వారి తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సిబ్బంది గురువారం అప్పగించారు. వివరాలు.. ముత్తుకూరులోని గిరిజన కాలనీకి చెందిన చెంచమ్మ తన ముగ్గురు పిల్లలతో కలిసి నగరానికి సోమవారం వచ్చారు. తల్లి నుంచి తప్పిపోయిన పిల్లలు వీఆర్సీ సెంటర్‌లో ఉండగా, ఐసీడీఎస్ అధికారులు అక్కున చేర్చుకొని శిశుగృహకు తరలించారు. చిన్నారుల తల్లిదండ్రులు గణేష్, చెంచమ్మ పిల్లల కోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఐసీడీఎస్ సంరక్షణలో ఉన్న చిన్నారులను అప్పగించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సౌజన్య, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సమత, శిశుగృహ మేనేజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మల పండగకు ఏర్పాట్లు షురూ



తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెంకటరమణ

నెల్లూరు సిటీ: నగరంలో ఈ నెల 15, 16న గొబ్బెమ్మల పండగ, తెప్పోత్సవం, పెద్దల పండగను ఘనంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15న నిర్వహించనున్న పెద్దల పండగకు సంబంధించి మైపాడు గేట్ నుంచి బోడిగాడితోట వరకు, చెక్‌పోస్ట్ నుంచి బోడిగాడితోట వరకు ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 14 జోన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, 14 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 14 మంది మేస్త్రీలు, 140 మంది కార్మికులు విధుల్లో పాల్గొననున్నారు. పెన్నా నది వద్ద గొబ్బెమ్మల పండగకు సంబంధించి 8 జోన్లలో ఎనిమిది మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 8 మంది మేస్త్రీలు, 170 మంది కార్మికులు విధులు నిర్వర్తించనున్నారు. మైపాడు గేట్ వద్ద నిర్వహించనున్న తెప్పోత్సవానికి సంబంధించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు చేపట్టారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎంహెచ్‌ఓ వెంకటరమణ పరిశీలించారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విజయవాడలో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. సేవాదళ్ కార్యక్రమాలపై గిరిధర్‌రెడ్డికి ఆయన పలు సూచనలిచ్చారు.

అడిషనల్ అడ్వొకేట్ జనరల్‌కు సన్మానం



నెల్లూరు(లీగల్): రాష్ట్ర హైకోర్టు అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని కనుపర్తిపాడులోని ఆయన నివాసంలో పలువురు గురువారం కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు రవికుమార్, రంగారావు, పద్మాకర్ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నెల్లూరు జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు జయప్రకాష్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సత్కరించారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు



పార్కును పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని 27వ డివిజన్లో గల రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో పార్కును గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పార్కులో ప్రహరీ, గేట్ నిర్మాణ పనులకు వేగవంతం చేయాలని సూచించారు. కార్పొరేటర్ మురహరి, ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, ఇంజినీరింగ్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీఈ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా గురువారం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యల్లాప్రగడ సుబ్బారావుకు నివాళి



నెల్లూరు(అర్బన్): వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతిని పొగతోటలోని పీవీఆర్ ఆస్పత్రి సమావేశ మందిరంలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ చైతన్యకుమార్‌రెడ్డిని సత్కరించారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, డాక్టర్లు వినీలారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నేతలు శేషయ్య, వీరయ్య, రామదాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భోగి తోట ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నుంచి నవాబుపేట బుజ్జమ్మతోట వరకు ఆండాళ్ అమ్మవారి భోగి తోట ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

సీఎస్‌ను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఎం అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

గదుల అద్దె తగ్గించాలని వినతి

నెల్లూరు(అర్బన్): తిరుమలలో గదులకు పెంచిన అద్దెను తగ్గించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరసనను గురువారం చేపట్టిన అనంతరం జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, నేతలు రమేష్, గిరికుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు శ్రీధర్‌బాబు ఎంపిక

నెల్లూరు(బృందావనం): గుంటూరుకు చెందిన కవి రావి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరంజక కవి ప్రతిభ పురస్కారాలకు నెల్లూరుకు చెందిన శ్రీధర్‌బాబు ఎంపికయ్యారు. ఆయన రచించిన ఎగురుతున్న పద్యం కవితా సంపుటికి పురస్కారాన్ని గుంటూరులో ఫిబ్రవరి తొమ్మిదిన ప్రదానం చేయనున్నారు.

యాక్టివా చోరీ

నెల్లూరు(క్రైమ్): యాక్టివా చోరీకి గురైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన విఘ్నేష్ నెల్లూరుకు బుధవారం మధ్యాహ్నం వచ్చారు. సిరి థియేటర్ ఎదురుగా రోడ్డుపై తన వాహనాన్ని నిలిపి సినిమాకు వెళ్లారు. అనంతరం బయటకొచ్చిన విఘ్నేష్‌కు వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగర్‌బత్తీల తయారీపై ముగిసిన శిక్షణ



నెల్లూరు(అర్బన్): నగరంలోని డ్రైవర్స్ కాలనీలో అగర్‌బత్తీల తయారీపై వరపరివార్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి మాట్లాడారు. 30 మంది మహిళలకు పది రోజుల పాటు శిక్షణను ఇచ్చామని వివరించారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు వెంకటసాయిని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీతారామిరెడ్డి, దీపక్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విశాఖపట్నంలో గత నెల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. కేరళలో నిర్వహించిన సీనియర్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్, సంతోష్ ట్రోఫీలో పాల్గొనడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు.

వీనులవిందుగా త్యాగరాజకృతుల ఆరాధన

నెల్లూరు(బృందావనం): బహుళ పంచమిని పురస్కరించుకొని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో త్యాగరాజస్వామి వారి కృతుల ఆరాధనను వీనులవిందుగా గురువారం నిర్వహించారు. తిరుపతమ్మ, శ్రీవత్సల ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించారు. తొలుత త్యాగరాజస్వామి చిత్రపటానికి పుష్పాంజలిని సమర్పించారు. ప్రిన్సిపల్ సాయిబాబా పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి బయటకెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెంలోని స్నేహానగర్‌లో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెంకటకృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న చిన్న కుమారుడు శ్రీనాథ్‌రెడ్డి కొంతకాలంగా మతిస్థిమితం సక్రమంగా లేక బాధపడుతున్నారు. అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగొచ్చేవారు. ఈ క్రమంలో పని ఉందంటూ గతేడాది డిసెంబర్ 28న బయటకెళ్లారు. రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• ఇంటి నుంచి బాలుడు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గౌడ హాస్టల్ సెంటర్‌లో నివాసం ఉంటున్న నాగేశ్వరి కుమారుడు మెకానిక్ పనులు చేస్తున్నారు. మెకానిక్ షెడ్ పెట్టివ్వాలని తల్లిదండ్రులను కొద్ది రోజులుగా బాలుడు కోరసాగారు. పని పూర్తిగా నేర్చుకున్న అనంతరం పెట్టిస్తామని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు ఇంటి నుంచి మంగళవారం వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు.

కర్పూర జ్యోతి దర్శనం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కర్పూర జ్యోతి దర్శనాన్ని శనివారం సాయంత్రం 6.40కు నిర్వహించనున్నామని అయ్యప్ప సేవా సమాజ కార్యదర్శి వెంకటరత్నం, రత్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాస పూజల్లో భాగంగా అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో మహావిష్ణు, గోదాదేవి ఆండాళ్‌కు భోగి కల్యాణాన్ని ఉదయం 10.30కి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): మహిళా టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు సరస్వతి పద్మజ, రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధారాణి, కార్యదర్శి సుధావాణి, జిల్లా గౌరవాధ్యక్షులు వనజాలత, అధ్యక్షులు సుజాత, కార్యదర్శి హుస్నార, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 30వ డివిజన్లో గల టీచర్స్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన రేషన్ సరుకుల సరఫరా



కందిపప్పును పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంటింటికీ బియ్యంతో పాటు నాణ్యమైన కందిపప్పును సరఫరా చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ (డీఎస్‌ఓ) అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లూరు, కోవూరు, తదితర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల ఇంటికెళ్లి కందిపప్పును ఆయనతో పాటు సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్లు తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా అందించిన కందిపప్పును కోవూరులోని నేతాజీనగర్, సత్రంవీధి, అంగన్‌వాడీ సెంటర్లలో ప్రజల సమక్షంలో ఉడికించారు.

'జనహిత - వాత్సల్య'కు విరాళం

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య బాలల, వృద్ధుల కేంద్రానికి రూ.1.08 లక్షల విరాళాన్ని నెల్లూరుకు చెందిన వైద్యులు కోటేశ్వరరావు, లక్ష్మి దంపతులు గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆశ్రమ కార్యదర్శి సాంబశివరావుకు అందించారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్-ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...
* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్-ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్-ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్-ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్-ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్




ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజప్పీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంత వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క-రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

యువర్స్

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్

● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.



● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

●గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీప చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్-ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ- ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ- ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ- ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు-వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్


రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ- ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.